క్లుప్తంగా

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం


సదస్సులో పాల్గొన్న గ్రామ వలంటీర్లు

రంపచోడవరం: ఎన్నికల సమయంలో గ్రామ వలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, హామీలు అమలు చేయడంలో విఫలమైందని గ్రామ వార్డు వలంటీర్ల రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి విమర్శించారు. రంపచోడవరంలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామవార్డు వలంటీర్ల జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్షణమే వలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రతతో పాటు రూ. 10 వేలు వేతనం అమలు చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా ఉద్యోగ,కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వలంటీర్ల వ్యవస్థ అసలు లేదని మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు.వలంటీర్లు భవిష్యత్ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోత రామారావులు మాట్లాడుతూ గ్రామ వలంటీర్ల జిల్లా సదస్సు భవిష్యత్ ఉద్యమాలకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. అనంతరం జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా పోడియ జాని, కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా కళావతి, సభ్యులను ఎన్నుకున్నారు.

భక్తుల మాలధారణ


మాలధారణ చేస్తున్న భక్తులు

అడ్డతీగల: మండల కేంద్రంలోని పవనగిరి క్షేత్రంలోని మూడో విడత సత్యదీక్ష మాలధారణ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో సుమారు 100 మంది భక్తులు మాలధారణ గావించారు. అనంతరం సత్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

వైద్యాధికారికి గ్రామస్తుల ఫిర్యాదు

రంపచోడవరం: ముసురుమిల్లి గ్రామంలో పనిచేస్తున్న ఆశ వర్కర్‌ను తొలగించాలని కోరుతూ గ్రామస్తులు గురువారం పెద్దగెద్దాడ పీహెచ్‌సీ వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ఆశ వర్కర్ సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొత్త ఆశ వర్కర్‌ను నియమించాలని కోరారు.

శిశువుల ఆరోగ్య రక్షణపై అవగాహన


చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి ఉదయ్‌కుమార్ రెడ్డి

చింతూరు: చలికాలం సమీపిస్తున్న తరుణంలో శిశువుల ఆరోగ్య రక్షణపై మండలంలోని కల్లేరులో గురువారం తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ చలికాలంలో పిల్లలను నేలపై కాకుండా ఉయ్యాలలో వేసి పరిశుభ్రమైన దుప్పటి కప్పి ఉంచాలని తెలిపారు. శిశువులు ఉన్న ఇంట్లో కట్టెల పొయ్యి వాడకూడదని, పాలు సక్రమమైన పద్ధతిలో శిశువులకు పట్టించాలని, పాలు పట్టించిన పిదప ఊపిరితిత్తుల్లోకి చేరకుండా కాసేపు భుజంపై వేసుకుని పడుకోబెట్టాలని ఆయన సూచించారు. పిల్లలు ప్రతిరోజూ సరిగా శ్వాస తీసుకుంటున్నారా, లేదా అనేది గమనించాలని, లేకుంటే వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించాలని, తల్లులు మంచి పౌష్టికాహారం తీసుకుంటే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి తెలిపారు.


బడిమెల పాఠశాలలో విద్యార్థుల సందడి


సీలేరులో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ


గౌరిదేవిపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో రాజులు

బాలల చేతుల్లోనే దేశ భవిత


ముంచంగిపుట్టులో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి, దాతలు


దూరువీధిలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

- ఘనంగా బాలల దినోత్సవం
- మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి
- పాఠశాలల్లో అంబరాన్నంటిన విద్యార్థుల సందడి

అరకులోయ రూరల్: జిల్లా వ్యాప్తంగా బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని పాఠశాలల్లో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో భాగంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు మాట్లాడుతూ మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు చిన్నారులంటే అమితమైన ఇష్టమని ఈ కారణంగా ఆయన జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా దేశాభివృద్ధికి నెహ్రూ చేసిన సేవలను కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకొవాలని కోరారు. నేటి బాలలకు మంచి భవిష్యత్తు ఇవ్వగలిగితే, వారే రేపటి తరంలో దేశనిర్మాణానికి తోడ్పడతారన్నారు. బాలలు మంచి ప్రవర్తనతో మెలిగి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. దేశం అన్ని రంగాల్లో ఎదుగుతున్న వేళ పిల్లలు ముఖ్యమైన భూమిక పోషించాల్సిన సరైన తరుణమిదేనన్నారు. విద్యార్థులు కేవలం చదువుకే అంకితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో చిన్నారులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. పాఠశాలల్లో విద్యార్థులు సందడి చేశారు.

అరకులోయ మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజు, అధ్యాపకులు నాగబాబు, విజయలక్ష్మి గణేష్, సుందరిరాణి తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని బడిమెల జీపీఎస్ పాఠశాలలో జరిగిన వేడుకలో భాష వలంటీర్ పి.కుమారి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల మండలంలోని జరిగిన వేడుకలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు మండలంలోని బూసిపుట్టు పంచాయతీలో జరిగిన వేడుకలో విశాఖపట్నానికి చెందిన వి.వి.చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీని ఎంఈవో కృష్ణమూర్తి అందజేశారు. హెచ్‌ఎం.పిఈఎం ప్రశాంతి, ట్రస్ట్ ప్రతినిధులు రమణ, రాధికబాల్ల, జీవిరావు, శివరమణ, సుధాలక్ష్మి, వరలక్ష్మి, పీఆర్పీ అనిల్, సురేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ దూరువీధిలో జరిగిన వేడుకలో వాసవి క్లబ్, పాడేరు మోదమాంబ హిల్స్ సంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సంస్థల ప్రతినిధులు మని, రూప, లక్ష్మి, కొండాజి, శ్రీనందు, సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరు, దారకొండ దుప్పులవాడ పంచాయతీల్లో జరిగిన వేడుకలో హెచ్‌ఎం కె.నాగభూషణం, ఏపీ జెన్‌కో విద్యుత్ సౌధా ఎండీ కోటేశ్వరరావు, పంపుడ్ స్టోరేజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, డిఎవి పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండలో జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని గౌరిదేవిపేటలలో జరిగిన వేడుకలో ఎంఈవో, హెచ్‌ఎం కణితి శేఖర్, ఉపాధ్యాయులు శ్రీశైలం, రవి, వినోద్, శ్రీను,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జరిగిన వేడుకలో హెచ్‌ఎంలు గోపాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.



పి.యర్రగొండ, రాజవొమ్మంగి పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

మండల సమావేశం రేపు


ఎంపీడీవో ప్రేమ్‌సాగర్

దుంబ్రిగుడ: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ బాకా ఈశ్వరి అధ్యక్షతన సమావేశం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధికి ప్రణాళికపై చర్చించనున్నట్టు తెలిపారు. మండల పాలకవర్గ సభ్యులు, సర్పంచ్‌లు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

పార్ట్‌టైమ్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన స్కీంలో భాగంగా పార్ట్‌టైమ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 20 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని శిక్షణ కాలవ్యవధి మూడు నెలలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9491057527కు సంప్రదించాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో హోమియో వైద్య శిబిరం


ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భాస్కరరెడ్డి

చింతపల్లి: చింతపల్లి డిగ్రీ కళాశాలలో హోమియోపతి వైద్య శిబిరాన్ని గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నూలు జిల్లాకు చెందిన దయాల్ బాగ్ రాధాస్వామి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య నిపుణుడు డాక్టర్ బి.భాస్కర రెడ్డి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎల్.పాత్రుడు, అధ్యాపకులు డాక్టర్ రమణ, డాక్టర్ కెజియా, లీలా పావని, సంతోషి, రవీంద్ర నాయక్, జగదీష్, లైబ్రేరియన్ జగత్‌రాయ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న 108 ఉద్యోగులు


దుంబ్రిగుడలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది


చింతపల్లిలో తహసీల్దారు రవికుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

అధికారులను కలిసిన 108 సిబ్బంది

రంపచోడవరం/ముంచంగిపుట్టు/దుంబ్రిగుడ: జిల్లా వ్యాప్తంగా 108 సిబ్బంది తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ర్యాలీలు గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా 108 జిల్లా సంఘం ప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ 108ను ప్రభుత్వమే నేరుగా నిర్వహించి, ప్రభుత్వ సిబ్బందిగా గుర్తించాలని, ప్రభుత్వ సిబ్బందితో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గత నాలుగేళ్లుగా పెండింగులో ఉన్న ఇంక్రిమెంట్లు, ఏరియర్స్‌ను, ఈఎల్ సొమ్మును అరబిందో సంస్థ తక్షణమే చెల్లించుటకు ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం పనిచేస్తున్న 12 గంటల విధులను 8గంటలకు తగ్గించాలని, అంతర్ జిల్లా బదిలీలు, విధినిర్వహణలో మృతి చెందిన సిబ్బందికి రూ.20 లక్షల బీమా సౌకర్యాలు కల్పించాలని, యాజమాన్యం కట్ చేసిన తమ పీఎఫ్ సొమ్మును, సిబ్బందికి ఇప్పించుటకు తగు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో వెయిటేజ్ ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 ఉద్యోగులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 25 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. రంపచోడవరంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ముంచంగిపుట్టులో ఈవోపీఆర్డీ చిన్నాన్న, ఆర్ఐ భూపతిపడాల్‌కు 108సిబ్బంది వినతిపత్రం అందజేశారు. దుంబ్రిగుడలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, డీటీ ముజీబ్‌కు 108 సిబ్బంది వినతిపత్రం ఇచ్చారు. చింతపల్లిలో తహసీల్దారు రవికుమార్‌కు వినతిప్రతాన్ని అందజేశారు. అడ్డతీగలలో డీటీ తేజస్విని, ఇన్‌చార్జి ఎంపీడీవో చిన్నిబాబుకు వినతిపత్రం ఇచ్చారు. వై.రామవరంలో తహసీల్దార్ పి.వేణుగోపాల్, అరబిందో సంస్థ ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. రాజవొమ్మంగిలో డీటీ కరీముల్లా, ఎంపీడీవో యాదగిరీశ్వరరావులకు వినతిపత్రాలు ఇచ్చారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు సూచనలు


రాజవొమ్మంగిలో ఫుట్‌పాత్ దుకాణదారులకు ఆదేశాలిస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మీదుగా చేపడుతున్న ఎన్‌హెచ్ 516ఈ రహదారి భాగంలో రోడ్డుకు ఇరువైపులా గల ఫుట్‌పాత్‌లపై దుకాణాలు తొలగించాలని రెవెన్యూ అధికారులు దుకాణదారులను హెచ్చరిస్తున్నారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఆదేశాల మేరకు స్థానిక ఆర్ఐ చెల్లమ్మ, వీఆర్వోలు జడ్డంగి, రాజవొమ్మంగిలలో గురువారం పర్యటించారు. రోడ్డుకు ఇరువైపులా మూడు అడుగుల దూరంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేయవద్దని, సామగ్రి ఉంచవద్దని దుకాణదారులకు ఆదేశించారు. ఇప్పటికే ఈ గ్రామాల్లో 18 అడుగుల వెడల్పుతో జాతీయ రహదారి రూపుదిద్దుకొంది. కాగా ఫుట్ పాత్‌లపై ఆక్రమణదారులను వెంటనే ఖాళీ చేయాలని హెచ్చరిస్తున్నామని ఆర్ఐ చెల్లమ్మ తెలిపారు. దుకాణాలు తొలగించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధికారులతో వ్యాపారుల వాగ్వాదం

జాతీయరహదారికి ఇరువైపులా మరో 3 అడుగులు ఖాళీ చేయాలని ఎన్‌హెచ్516 సిబ్బంది మరో సారి మార్కింగ్ ఇస్తుండడంతో రాజవొమ్మంగిలో గురువారం సాయంకాలం అధికారులు, దుకాణదారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. ఎన్నిసార్లు వెనక్కు జరగాలంటూ కొంత మంది దుకాణదారులు మార్కింగ్ ఇచ్చేందుకు వచ్చిన వీఆర్వోలు, సర్వేయర్లతో గొడవకు దిగారు. దీనితో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కాగా దుకాణదారులకు అధికారులు నచ్చ చెప్పడంతో రూల్ ప్రకారం ఎంత వరకు జరగాలో అంత వెనక్కు జరుగుతామని సమ్మతించడంతో వివాదం సద్దుమణిగింది.

సమగ్ర ప్రణాళికతోనే గ్రామాల అభివృద్ధి


అరకులోయలో మాట్లాడుతున్న ఎంపీడీవో లవరాజు, వేదికపై ఎంపీపీ ఉషారాణి


రంపచోడవరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసుదొర

అరకులోయ రూరల్: సమగ్ర ప్రణాళికతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో లవరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 14 పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయం, పంచాయతీ ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించి గ్రామ స్థాయిలో నిర్వహించాల్సిన అవసరమైన ప్రధాన సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లవరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అందరూ సమన్వయంగా పనిచేయాలన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక తయారుచేయాలని సూచించారు. పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సక్రమంగా పౌష్టికాహారం అందడం లేనట్టు, గ్రామాల్లో పాఠశాలలు సరైన సమయాల్లో తెరవడం లేనట్టు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల సక్రమంగా సేవలందించే లా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బస్కి పంచాయతీల్లో వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్టు తెలిసిందని, ఇటువంటిని పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఎంపీపీ ఉషారాణి, వైస్ ఎంపీపీ రామన్న, టౌన్ ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రంపచోడవరం: రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక తయారు చేసేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రంపచోడవరంలోని వైటీసీలో ఎంపీడీవో సుండం శ్రీనివాసుదొర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో జరిగింది. పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్–1 నుంచి గ్రేడ్–4 వరకు ఉద్యోగులు, మండల గ్రామసమాఖ్య వీవో లీడర్లు, అధ్యక్షులు, సెక్రటేరీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సంధ్యారాణి, జెఈ వెంకరమణ, ఏట లక్ష్మణరావు తదితరులు పలు సూచనలిచ్చారు.

రాజవొమ్మంగి: మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎంపీడీఓ యాదగిరీశ్వర్రావు గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి చెంది గ్రామ పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన మౌలిక అవసరాలను గుర్తించి ప్రణాళిక, అంచాన వ్యయాలు రూపొందించాలని ఎంపీడీవో ఆదేశించారు. సిబ్బందికి పలు సూచనలు, ప్రభుత్వ విధివిధాలను తెలియజేశారు. తాగునీరు. విద్య, వైద్యం, రహదారుల కల్పనకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

వాహనాల తనిఖీలు


వాహనచోదకులతో మాట్లాడుతున్న ఎస్ఐ పాపినాయుడు


దుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక కేంద్రం చాపరాయి వద్ద ఎస్ఐ కె.పాపినాయుడు ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలు తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. వాహనచోదకులు ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. గంజాయి రవాణా చేస్తే సహించేది లేదన్నారు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీమా అందజేత


చెక్కును అందజేస్తున్న ఏపీజీవీబీ బీఎం ప్రవీణ్‌బాబు

జి.మాడుగుల: మండలంలోని వంతాల పంచాయతీకి చెందిన జవ్వాది మత్స్యలింగం కొన్ని నెలలు క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు పీఎం సురక్ష బీమా పథకం ద్వారా బీమా మంజూరైంది. పథకం ద్వారా మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మృతుడి తనయుడు ప్రకాష్‌నకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌బాబు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడు మత్స్యలింగం గతంలో ప్రధానమంత్రి సురక్ష బీమా పథకంలో చేరి ఉండడంతో బీమా వర్తించినట్టు చెప్పారు. కృష్ణమూర్తి, గోపాల్, పాండురాజు, రాజుబాబు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు పనులు


శ్రమదానంతో తాత్కాలిక రహదారి నిర్మాణ పనులు చేస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: డౌనూరు పంచాయతీలో ఉసిరకపాడు రోడ్డు పనులను కాంట్రాక్టర్ పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో బండరాళ్లు ఉండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, అత్యవసర సేవలందడం లేదని స్థానికులు రాజుబాబు, నాగేశ్వరరావు, సుబ్బారావు, సింహాచలం చెప్పారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో పీఎం జన్‌మన్ పథకం గృహాల నిర్మాణానికి సామగ్రి తీసుకురావడం కష్టతరంగా మారిందని చెప్పారు. ఈ కారణంగా గ్రామస్తులంతా కలిసి గురువారం శ్రమదానంతో ఉసిరకపాడు రోడ్డు మరమ్మతు పనులు చేశామన్నారు. మట్టిని చదునుచేసి, పెద్ద పెద్ద రాళ్లను తొలగించి, తాత్కాలికంగా రహదారి నిర్మించినట్టు చెప్పారు. గ్రామానికి తాత్కాలికంగా రహదారి నిర్మాణానికి శ్రమదానం చేసిన వారందరికీ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామానికి పూర్తిస్థాయిలో రహదారి నిర్మించాలని వారు కోరారు. ఆరు కిలోమీటర్ల రహదారి అలానే ఉండిపోయిందన్నారు. కాంట్రాక్టర్‌కు రోడ్డు పూర్తి కాకుండా బిల్లు చెల్లించినటన్టుగా వారు ఆరోపించారు. ఈ విషయంపై జేఈ రామకృష్ణ మాట్లాడుతూ రోడ్డు పనులను వర్షాలు తగ్గిన వెంటనే చేపడతామన్నారు. గతంలో ఈ రోడ్డు కోసం రూ.1.03కోట్లుతో చేపట్టామని, అయితే కాంట్రాక్టర్‌కు రూ.15లక్షలు మాత్రమే చెల్లించినట్టు తెలిపారు. త్వరితగతిన రోడ్డును పూర్తి చేయిస్తామని తెలిపారు.

ప్రజా సమస్యలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

అరకులోయ రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంపై సీపీఎం నేతలు అరకులోయ, ముంచంగిపుట్టు, దుంబ్రిగుడ మండలాల్లో గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా అరకులోయలో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి రామారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. స్మార్ట్ మీటర్లు పేరుతో చంద్రబాబు ప్రభుత్వం ప్రజల నుంచి అక్రమంగా వసూలు చేస్తుందన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నాయకులు మగ్గన్న, బుజ్జిబాబు, హరి పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: పీఎం జన్‌మన్ పథకంలో గృహాల నిర్మాణాల కోసం లబ్ధిదారులకు రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కార్యదర్శి త్రినాథ్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేశారు. పీఎం జన్‌మన్ పథకం లబ్ధిదారులకు ఇస్తున్న నగదును రూ.5లక్షలకు పెంచాలని, ఉచితంగా ఇసుక అందించాలని డిమాండ్ చేశారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నేతలు భీమరాజు, నర్సయ్య, నారాయణ, గణపతి పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పోతురాజు మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెరగడంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతలు సురేష్‌కుమార్, సూర్యనారాయణ సత్యనారాయణ పాల్గొన్నారు.